క్లుప్తంగా

రంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నెమలిగుండ్లరంగనాయక స్వామి

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవి ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్లరంగనాయకస్వామి దేవస్థానికి శనివారం భక్తులు పోటేత్తారు. తొలుత నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణదేవరాయుల కాపుబలిజ, కాశినాయన, యోగివేయన రెడ్ల, అర్యవైశ్య, గోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రాల్లో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం

మార్కాపురం: ఈనెల 17న పెన్షనర్స్ డే సందర్భంగా స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 75 సంవత్సరాలు నిండిన సీనియర్ పెన్షనర్లకు సన్మానం చేస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఐ. బాల సుబ్బారావు, జయరావు శనివారం తెలిపారు. 2009 జనవరి1 నుంచి డిసెంబరు 31 లోపు రిటైర్డు అయిన వారు సన్మానానికి అర్హులని, ఈనెల 12లోపు మార్కాపురంలోని పెన్షనర్ యూనిట్ ఆఫీసులో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని చెప్పారు.

బెల్టుషాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు

అర్థవీడు: మండలంలోని దొనకొండ, మోహిద్దీన్ పురం గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. శనివారం ఇద్దరు వ్యక్తులను తహసీల్దార్ నాగార్జునరెడ్డి వద్ద బైండోవర్ చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టు షాపులపై సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలు ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

దేవాలయాల పరిరక్షణకు హైందవ శంఖారావం

పుల్లలచెరువు: విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో దేవాలయాల పరిరక్షణ కోసం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం పుల్లలచెరువులో జరిగిన హిందూ సమ్మేళనంలో వీహెచ్‌పీ నేత గజ్జెల్లి శ్రీనువాసులు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో హిందూ దేవాలయాల పరిరక్షణకు విజయవాడలో జనవరి 5వ తేదీన హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షలాది మంది హిందువులు ఈ కార్యక్రమానికి తరలిరానున్నారని పేర్కొన్నారు. ప్రముఖ్ నాగిరెడ్డి మాట్లాడుతూ దేవాలయాల్లో అన్యమతస్తులను తొలగించాలని, నాణ్యమైన ప్రసాదాలు అందించాలని, దేవాలయాల ఆదాయం హిందూ దేవాలయాలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ జిల్లా ధర్మప్రచార్ ప్రముఖ్ వెంకట్రాములు, పుల్లలచెరువు ప్రముఖులు గురునాథం, బాబు, నాగిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా నాగరాజు

కురిచేడు: మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా కేవీ నాగరాజును సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వీఆర్వోలందరూ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా వీఎస్ సరోజని, ప్రధాన కార్యదర్శిగా చింతల రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా వి.హనుమంతరావు, కోశాధికారిగా చింతపల్లి రమాదేవి, గౌరవ అధ్యక్షులుగా వీసీహెచ్ శేషగిరిరావు, కె.ఖాశిం, సభ్యులుగా ఐవీ రాజ్యలక్ష్మి, వి.రేణుక, ఎం.వెంకటకృష్ణలు ఎన్నికయ్యారు.

శునకాలతో భయం..భయం

● కోతులు కూడా తోడవడంతో జనం బెంబేలు



శివాజీనగర్‌లో వీధి కుక్కలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా పెరిగింది. వీటికి కోతులు కూడా తోడవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న శివాజీనగర్‌లో పలు వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువైంది. ఆ ప్రాంతాల్లోకి కొత్త వ్యక్తులు కనబడితే వెంటపడి కరుస్తున్నాయి. బైక్‌పై వెళ్లేవారిని సైతం వదలడం లేదు. దీంతో భయపడి బైక్‌పై నుంచి కిందపడి గాయాలపాలవుతున్నారు. పట్టణంలోని పూలసుబ్బయ్యకాలనీ, భగత్‌సింగ్ కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ, ఎస్టేట్, డ్రైవర్ల కాలనీ, నానాజాతుల పేట, రాజ్యలక్ష్మి కాలనీ, నాగులవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఆ ప్రాంతాల్లో నివశించే ప్రజలు కూడా రాత్రిపూట రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. గుంపులుగా ఉంటూ వాహనాల వెంట పరిగెత్తుతూ భయపెడుతున్నాయి. గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ విషయంపై కౌన్సిలర్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో మార్కాపురంలో కుక్కలతోపాటు కోతులు కూడా ఇబ్బందిపెడుతున్నాయి. ఇళ్లలోనికి వచ్చి సామగ్రి, తినుబండారాలను తీసుకెళ్లడంతో పాటు అడ్డువచ్చిన మనుషులపైకి దూకుతూ కరుస్తున్నాయి. వీటిని నివారించాలని పట్టణప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. కాగా గత ఏడాది కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేసినప్పటికీ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను, కోతులను రాత్రిపూట మార్కాపురం పట్టణ శివార్లలోని పలకల గనుల వద్ద వదిలి వెళ్లడంతో కుక్కలు, కోతుల బెడద మళ్లీ ఎక్కువైంది. వీటి ధాటికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవలే పట్టణంలోని అలుగువద్ద ఓ కుక్క ఇద్దరిని కరవగా, వేములకోటలో 3 రోజుల క్రితం ఒకే కుక్క నలుగురిని కరిచింది.

> **త్వరలో పట్టుకుంటాం**
> మార్కాపురం మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. త్వరలో వాటిని పట్టుకుని జనసంచారంలేని ప్రాంతంలో వదిలి పెడతాం. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం.
> – నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జడ్జి ఎ.ఓంకార్

గిద్దలూరు రూరల్: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ అన్నారు. పట్టణంలోని కోర్టు భవనంలో శనివారం న్యాయవాదులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఇరుపార్టీల వారు చెప్పిన అంశాలను సున్నితంగా అవతల వారికి చెప్పి రెండు పార్టీలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. ఇరుపార్టీలకు తటస్థంగా వ్యవహరించాలన్నారు. న్యాయవాదుల అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఎస్.శేషశయనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్ షరీఫ్, న్యాయవాదులు అంజనీకుమార్, హిమశేఖరరెడ్డి, అహల్య, రాజ్‌కుమార్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున రెడ్డికి అభినందనలు



అవార్డు అందుకుంటున్న మల్లికార్జున రెడ్డి

మార్కాపురం టౌన్: పట్టణంలోని జీఎంఆర్ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. కరస్పాండెంట్ జి.మల్లికార్జునరెడ్డికి బ్రెయిన్ ఫీడ్ సంస్థ అందజేసినట్లు శనివారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో కరస్పాండెంట్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న స్కూల్స్‌లో అత్యుత్తమ విద్యనందిస్తూ, విద్యార్థుల సమగ్ర ప్రగతికి పాటుపడే స్కూల్స్‌కు ఈ అవార్డు ప్రదానం చేస్త్రాన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో జరిగిన కార్యక్రమంలో అందించారని తెలిపారు.

● పూల పొదరిల్లు

రాచర్ల: మండలంలోని గౌతవరం, పలుగుంటిపల్లె, అనుమలవీడు, రాచర్ల గ్రామాల రైతులు బోరుబావుల కింద సాగు చేసిన చామంతి, బంతిపూల పంటపొలాలు ఆ గ్రామాలకు కొత్త అందాలనిస్తున్నాయి. బంతిపూల పంటపొలాలు పసుపు, ఎరుపు వర్ణంతో స్వాగతం పలుకుతున్నాయి. ఆయా గ్రామాల్లో దాదాపు 10 ఎకరాల్లో సాగు చేసిన బంతిపూల తోటలు కోత దశకు రావడంతో గిద్దలూరు..కంభం వెళ్లే ప్రధాన రహదారికి పక్కనే ఉండటంతో ప్రకృతి ప్రేమికులకు అహ్లాదాన్నిస్తున్నాయి. ఇటీవల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బంతిపూలు కుళ్లిపోగా ధరలు పూర్తిగా తగ్గిపోయినట్లు రైతులు వివరించారు. ప్రస్తుతం కిలో బంతి పూలు రూ.30 నుంచి 40 కాగా, చామంతి పూలు కిలో రూ.100 నుంచి 120 రూపాయల వరకూ ధర ఉందని రైతులు తెలిపారు.



ప్రత్యేక వర్ణంలో చామంతి పూలు



పసుపు, ఎరుపు వర్ణంలో ఉన్న బంతిపూల తోట

స్మార్ట్ మీటర్లను విమర్శించి..
అవే ఎలా బిగిస్తారు?



స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న సిబ్బంది

దర్శి: గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తారంటూ ఎన్నో రకాలుగా విమర్శించిన మీరు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే వాటిని ఎలా బిగిస్తారని కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పుట్లూరి కొండారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు, వ్యాపారులు స్మార్ట్ మీటర్లు బిగిస్తే అన్యాయం అయిపోతారంటూ గగ్గోలు పెట్టిన మీరు ఇప్పుడు రైతులను, వ్యాపారులను తెలిసి అన్యాయం చేస్తునట్లే కదా అని నిలదీశారు. రైతులు, వ్యాపారులకు వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారంటే మీరు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి మళ్లీ మాట మార్చి రూపాయి ఇరవై ఐదు పైసలు చార్జీలు పెంచిన మీ పాలన ఏ రకంగా పాలిస్తున్నారో ప్రజలకు బాగా అర్థమవుతోందన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కురిచేడు: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా మండలంలోని దేకనకొండ శివారులో సింగరయ్య కొండ పక్కన వేంచేసి ఉన్న శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సంతాన సుబ్రహ్మణ్య స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు, అనంతరం కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి దర్శి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

పట్టుజారితే అంతే..

● ఫుట్‌పాత్‌లపై ప్రయాణిస్తున్న విద్యార్థులు



కందులాపురం సెంటర్ అర్థవీడు లోయకు వెళ్లే బస్సును ఎక్కుతున్న విద్యార్థులు

కంభం: పాఠశాలలకు, కళాశాలలకు గ్రామీణ ప్రాంతాల నుంచి సరిపడా బస్సులు లేక పోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అర్థవీడు, బేస్తవారిపేట మండలాల్లోని గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు కంభంలో చదువుకోడానికి వస్తుంటారు. పాఠశాలలు, కళాశాలలు ఉదయం ప్రారంభమయ్యే, సాయంత్రం వదిలే సమయాలు దాదాపు ఒకటే కావడంతో విద్యార్థులందరూ ఒకే సారి బయటకు వచ్చి వారి ఊర్లకు వెళ్ళేందుకు బస్సులు ఎక్కుతుంటారు. ప్రయాణికులు ఎంత మంది ఉన్నా ఆసమయంలో ఉండే బస్సు ఒక్కటే కావడం, ఆ బస్సు వెళ్ళి పోతే తిరిగి బస్సు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితులు ఉండటంతో గత్యంతరం లేక విద్యార్థులు ఫుట్‌పాత్‌ల పైన వేళ్లాడుతూ 30-40 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కంభం నుంచి అర్థవీడు మండలంలోని పాపినేనిపల్లి లోయకు, వెలగలపాయ లోయకు , బేస్తవారిపేట మండలంలోని కోనపల్లి లోయకు విద్యార్థులు వచ్చేందుకు వీలుగా బస్సులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



కిక్కిరిసిన బస్సులో వేళ్లాడుతూ..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ బలోపేతం చేసేందుకు గ్రామ స్థాయి నుంచి నూతన కార్యవర్గం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం బేస్తవారిపేటలోని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి గృహంలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. గ్రామ, మండల, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం అధిష్టానం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు గిద్దలూరులోని విశా సుబ్బరత్నం కళ్యాణమండపంలో గిద్దలూరు నియోజకవర్గస్థాయి వైఎస్సార్ సీపీ సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బూచెపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, వార్డ్ కౌన్సిలర్‌లు, పార్టీ ముఖ్యమైన నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ప్రతి పంచాయతీ నుంచి ముఖ్యమైన నాయకులు హాజరయ్యేలా చూడాలని కోరారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు డి. ఖాజామీయా, గుంటి స్వప్న, ఎంపీటీసీలు మల్లెల శేఖర్‌రెడ్డి, దగ్గుబాటి బాలరంగయ్య, సర్పంచ్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డి, మాజీసైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కార్యదర్శి టీవీఎస్‌పీ శర్మ, నాయకులు పాల్గొన్నారు.



శివరామిరెడ్డి తో మాట్లాడుతున్న కేపీ

శివరామిరెడ్డిని పరామర్శించిన కేపీ

కంభం: వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ మెట్టు శివరామిరెడ్డిని శనివారం గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరామర్శించారు. గతనెల 24న శివారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించగా బెయిల్‌పై విడుదలయ్యారు. ఈనేపథ్యంలో నాగార్జునరెడ్డి శనివారం శివరామిరెడ్డి ఇంటికి వెళ్ళి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, సయ్యద్ సలీం, హుస్సేన్ బాష, నన్నెబోయిన రవికుమార్, సూర్యప్రకాష్, రఫి, సుభాష్, నాయకులున్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

మార్కాపురం టౌన్: ఎంఎస్ఎంఈ సర్వే, సపోర్టు యాప్‌లో చిన్న స్థాయి దుకాణాల నుంచి పెద్ద పరిశ్రమల వరకు వివరాలను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నారాయకణరావు తెలిపారు. శనివారం పట్టణంలోని చిన్న దుకాణాలలో పర్యటించియాప్ ఉపయోగాలను వివరించారు. సచివాలయ సిబ్బంది వ్యాపారస్తుల వద్దకు వచ్చినప్పుడు తమ వివరాలను తెలిపి ఎంఎస్ఎంఈ యాప్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసన్, సచివాలయం సిబ్బంది, సర్వేయర్‌లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



యాజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు, సిబ్బంది

బస్టాండ్‌లో ప్రయాణికుడిపై దాడి

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఉన్న ఒక కూల్‌డ్రింక్ షాపులో కూల్‌డ్రింకు బాటిల్‌ను అధిక ధరలకు ఎందుకు విక్రయిస్తున్నారని ప్రశ్నించిన ప్రయాణికుడిపై షాపులో పనిచేసే యువకులు దాడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కంభంకు చెందిన అజిత్‌కుమార్ హైదరాబాద్‌కు వెళ్లేందుకు శుక్రవారం రాత్రి మార్కాపురం బస్టాండుకు వచ్చారు. ప్రాంగణంలోనే ఉన్న కూల్‌డ్రింకు షాపు వద్ద బాటిల్ ధర రూ. 20 అయితే 25 రూపాయలు చెప్పడంతో ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన షాపులోని యువకులు కర్రలతో దాడిచేశారు. దీనిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బస్టాండు ఆవరణలో ఉన్న కూల్‌డ్రింకు షాపులో పనిచేస్తున్న యువకులు తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్‌ను ఎమ్మార్పీ ధరకంటే ఎక్కువగా విక్రయిస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: మార్గశిర మాసం పురస్కరించుకొని మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు.



అలంకరణలో శ్రీవారు

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అవతరణ దినోత్సవం

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి అవతరణ దినోత్సవాన్ని భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పురోహితులు మణిబాబు శర్మ గణపతిపూజ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అష్టోత్తర శత నామావళి పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రత్యేక అలంకరణ చేసి మహా నైవేద్యం సమర్పించి సామూహిక హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భైరవానంద స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.